# ఆదర్శ యువతి

రచన :
శ్రీ. కలగర్ల నరసింహామూర్తి.

రంగయ్య, సీతమ్మ కష్టపడి పనిచేసి, న్యాయంగా పొట్టపోసుకొనే ఆదర్శపంతులు. వాళ్ళకు ఐదుగురు పిల్లలు. పెద్దవాడు రాజును మెట్రిక్ వరకూ చదివించి, ఉద్యోగం నిమిత్తం బొంబాయి పంపించారు. రాజు తొందరగా ఉద్యోగం సంపాదించుకొని ప్రతీ నెలా స్వగ్రామంలోని తన ప్రియమైన తలిదండ్రులకు వేళ తప్పకుండా మనియార్డరు పంపించేవాడు.

రాజుకు రాత్రి శిఫ్టులోనే పని ఉండేది. ఏదో ఇంత వండుకొని తిని పగలల్లా హాయిగా విశ్రాంతి తీసుకొనేవాడు. ఊర్లో జులాయిగా తిర్గడం పోకిరీ వేషాలు వెయ్యడం ఇలాంటివి రాజుకు గిట్టేవి కావు. అందుకే అతనంటే చాలామంది అభిమానించేవారు. ముఖ్యంగా పక్కింటిపిల్ల సరోజకు రాజంటే ఎంతో ఇష్టం. తొందర్లోనే ఆ అమ్మాయి రాజుతో స్నేహం చేసుకుంది.

రాజు, సరోజా, ఒకనాడు కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ విక్టోరియా గార్డెన్స్‌లో తిరుగుతుంటే చూసిన పెద్దమనిషొకడు, ఆ విషయాన్ని వెంటనే ఒక్క కార్డుముక్క ద్వారా రాజు తండ్రికి తెలియజేస్తూ 'రబ్బరు బొమ్మలాంటి ఒక షోకిల్లా రాణితో రాజు అస్తమానం తిరుగుతున్నాడు. తొందర్లోనే వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకోవచ్చు. ఆనక మీ గతి అధోగతే' అంటూ హెచ్చరించాడు.

ఉత్తరం చూసిన రంగయ్య ఉగ్రరూపం దాల్చి, ఆ మర్నాడే బయల్దేరి బొంబాయి వచ్చాడు? తన కొడుకు సాగిస్తున్న ప్రణయ కలాపం అతనికి అసహ్యం కలిగించింది. అనుకోకుండా, వచ్చిన తండ్రిని చూసి తృళ్ళిపడ్డాడు రాజు,

రంగయ్య కోపంతో మండిపోతూ రాజును చూసి 'ఒరేయ్ రాజూ! నువ్వు ఈ బురద గుంటలో దిగడానికి ఎవరి అనుమతి తీసుకున్నావురా? నిన్ను కని, పెంచి పెద్దజేసిన తలిదండ్రులు చచ్చారనుకున్నావా? ఎంత కష్టపడి, ఎంత అప్పుచేసి నిన్ను చదివించామో. నీకు తెలుసా? నువ్వు ఈ విషయాలన్నీ పూర్తిగా మరచిపోయి, ఇక్కడ ఒక వెధవగా మారి కూర్చున్నావ్! ఇహ ఇంటికి పద అక్కడ మీ అమ్మ నీ వ్యవహారం అంతా విని ఏడుస్తూ కూర్చుంది. మాకెంత తలవంపులు తెచ్చావురా! మన స్వగ్రామంలో బోలెడంత కట్నంతో, చక్కని చుక్క నొకదానిని చూసి నీ పెళ్ళి జరిపిస్తాను. నీ మంచి కోసం ఆ బజారుపిల్లను వదలి బయల్దేరు' అన్నాడు.

రాజు దీనంగా తండ్రివంక చూస్తూ 'కాసి నాన్నా, నేను ఈ అమ్మాయిని ఎప్పుడో వాగ్దానం చేసాను. వెధవ కట్నం కోసం ఆశపడి ఇప్పుడా అమ్మాయికి అన్యాయం చెయ్యమంటావా? నువ్వు చెప్పినట్టు నాకు ఇంకో అమ్మాయి లభించవచ్చు. కానీ ఇన్నాళ్ళు ఏ అమ్మాయితో నైతే నేను తిరిగి, స్నేహం చేసి ఎంతో ఆనందాన్ని సంపాదించానో, ఆ అమాయకురాలి గతేం కావాలి? ఇప్పుడీ




మచ్చతో తిరిగి ఆమెను ఎవరు పెళ్ళి చేసుకుంకుంటారు? ఈ అమ్మాయి ఎంతో బుద్ధిమంతురాలు, కేవలం నాకోసం మాత్రమేగాక, ఈ అమ్మాయి భవిష్యత్తు కోసం కూడా, నేను నీ కోర్కెను తృణీకరించక తప్పదు, నాన్నా, నువ్వెలాగూ బొంబాయి వచ్చావు. కొద్ది రోజులు ఉండి, నీ చేతులమీదుగానే మా పెళ్ళి జరిపించి మమ్మల్ని ఆశీర్వదించు. భగవంతుని సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్నాను ఇంతవరకూ ప్రతి నెలా మీకు చేస్తున్న చిన్న సహాయాన్ని, నా జీవితాంతం తప్పక చేస్తాను' అన్నాడు.

రంగయ్య రెచ్చిపోయి 'ఛీ! నిన్ను చూస్తుంటే నా ఒళ్ళు మండిపోతూ ఉంది. నీ పెళ్ళి నేను చూడ నక్కర్లేదు. అసలు నువ్వు నా కొడుకువే కాదనుకుంటాను. నువ్వు పుట్టి చచ్చావనుకుంటాను. ఇహ ఈ ఇంట్లో ఒక్క క్షణం కూడా ఉండను' అంటూ విసవిస లాడుతూ స్టేషన్ వైపుగా వెళ్ళిపోయాడు.

రాజు. తండ్రి ధృఢనిర్ణయం విని కన్నీరు కార్చాడు. కానీ తనను ప్రేమించి తనతోటిదే లోకమని నమ్మిన సరోజకు అన్యాయం చెయ్యలేకపోయాడు. ఒక శుభముహూర్తాన రాజు నలుగురు పెద్దల ఎదుట, అగ్నిసాక్షిగా సరోజ మెడలో తాళిగట్టి వివాహం చేసుకున్నాడు.

* * *

రంగయ్య ఇంటికి వెళ్ళి వెళ్ళడంతోనే, తను పెద్దకుమారునితో పూర్తిగా తెగ తెంపులు చేసుకున్నానని ఊరంతా చాటి, ఒక సంపన్నుల అమ్మాయితో తన రెండో కుమారుని పెళ్ళి ముగించాడు. ఆ అమ్మాయి బాగా కట్నం తెచ్చింది. ఈ పెళ్ళికి రాజుకు ఆహ్వానం రాలేదు, కొద్దిరోజుల్లో ఆ అమ్మాయి తన తలిదండ్రులను వదలి అత్తవారింటికి వచ్చింది. సారె, చీరె దండిగా తెచ్చింది. అత్తింటికి వచ్చింది లగాయతూ, ఆ అమ్మాయి రంగయ్యతోనూ, సీతయ్యతోనూ కయ్యామాడడం ప్రారంభించింది.

'మనం పిల్లల్ని కని పెంచి పెద్దజెయ్యటం వల్ల ఏవిటి ప్రయోజనం! వాళ్లు పెరిగి పెద్ద వారైనతర్వాత తలిదండ్రుల్ని వెంట్రుకల్లా చూస్తారు. మా పెద్దవాడు చూడండీ, ఏం చేస్తాడో! ఇహ రెండోవాడు. వాడికోసం నేను ఎంతో గొప్ప సంబంధాన్ని, కావలసినంత కట్నంతో తెచ్చి పెళ్ళిచేసాను. ఈ వెధవ, కుక్కపిల్లలా ఇరవైనాలుగ్గంటలూ, పెళ్లాం చెంగు పట్టుకొని తిరుగుతున్నాడు. అయినా ఇదేం ఖర్మమో, ఈనాటి అమ్మాయిలకు ఇదేం పిచ్చి ప్రేమో! వాళ్ళకు భర్తప్రేమ తప్పించి, అత్త మామల ఆదరాభిమానాలు మంచి చెడ్డలు బొత్తిగా అఖ్ఖర్లేదు' అంటూ చాటేవాడు రంగయ్య.

కష్టాలు ఒంటరిగా రావన్నట్టు, రంగయ్యకు ఇంకో పెద్ద కష్టం వచ్చిపడింది. బొంబాయిలోనున్న తన పెద్ద కొడుకు రాజు మరణించాడనే దుర్వార్త, పిడుగులా వచ్చి పడింది. రంగయ్య మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు. అంతవరకూ రాజుమీదగల ద్వేషం అంతా ఒక్కసారిగా మాయమై పోయింది. 'ఒరేయ్ రాజూ! నీ పెళ్ళిని కళ్లారా చూసి, మీ దంపతుల్ని ఆశీర్వదించమని ఎంతగానో ప్రాధేయపడ్డావ్! కానీ నేను దుర్మార్గుణ్ణి. చెట్టులాంటి నిన్ను ఆశీర్వదించడానికి బదులు చచ్చావనుకుంటాను అని శపించాను. నేను తండ్రిని కాదురా, కిరాతకుణ్ణి!' అంటూ గుండెలు బాదుకుంటూ వలవలమని ఏడ్చాడు రంగయ్య.

రంగయ్య దంపతులు, కమ పెద్దకొడుకు మరణంతో పూర్తిగా కృంగి కృశించి జీవచ్ఛవాలుగా తయారయ్యారు. అలా ఒక ఏడాది గడచింది. రంగయ్యలోని లోభత్వం ఇప్పుడు పూర్తిగా నశించింది.

ఒకనాడు సూర్యుడు నడినెత్తిమీద నాట్యమాడుతున్న వేళ, పొలంలో పనిచేసుకుంటున్న రంగయ్యకు, ఆ దారి వెంటనే వస్తున్న ఒక స్త్రీ కనిపించింది. ఆ స్త్రీ చేతిలో ఒక చంటి బిడ్డకూడా ఉంది. ఆ దృశ్యాన్ని చూడగానే రంగయ్య హృదయం ద్రవించిపోయింది. తిన్నగా ఆ స్త్రీని సమీపించి 'చూడమ్మా!' ఎండ మండిపోతూ ఉంటే, ఇలా తిరుగుతున్నావ్. ఆ పసిప్రాణం ఏమి గతేం కావాలి? పదమ్మా, ఈ సమీపంలోనే మా ఇల్లుఉంది. కాస్త విశ్రాంతి తీసుకుందువు గాని, పదమ్మా!' అంటూ ఆవిడను తన ఇంటికి తీసుకవెళ్ళాడు. ఆవిడ స్నానం ముగించింది. భోజనం చేసి చేతిలోని చంటిబిడ్డకు కడుపునిండా పాలు పోసింది. ఇంతలో రంగయ్య అక్కడకు వచ్చి 'అమ్మా! నీకు ఐనవారెవ్వరూ లేరా?' అన్నాడు.

ఆవిడ దీనంగా రంగయ్య వంక చూసి 'మీకు కష్టం కలిగించకపోతే నా కథను చెబుతాను. మావయ్యా! నేను మీ కోడల్ని. చనిపోయిన మీ పెద్దబ్బాయిగారి భార్యను. ఈ చంటిపిల్ల ఏకైక సంతానం. ఆయన నన్ను అకస్మాత్తుగా కలుసుకున్నారు. అకస్మాత్తుగా వివాహం చేసుకున్నారు. అలానే అకస్మాత్తుగా మరణించారు. నా బ్రతుకిలా నాశనమైపోయింది' అంటూ ఆవిడ రెండు

చేతుల్తో ముఖాన్ని కప్పుకొని లోలోపలే దుఃఖించ సాగింది.

ఆవిడ మాటలు వినీవినడంతోనే రంగయ్య సద్రున ఆకాశమంత ఎత్తున లేచి 'ఛీఛీ! సిగ్గు లేనిదానా! ముందు అవతలకినడు పో' అంటూ పిచ్చివానిలా పెద్దగా అరిచాడు.

'అబ్బా! అదేవిటినాన్నా, మరీ అంత మూర్ఖంగా ప్రవర్తిస్తావ్? ముందు ఆవిడ చెప్పేదేదో, పూర్తిగా విను' అంటూ రంగయ్య కుమార్తె తండ్రిని మందలించింది.

'ఈ రాకాసి నా బిడ్డణ్ణి మింగేసింది. ఇంకా దీనికేం కావాలి? వాడి తండ్రిని కూడా తిందామనా? రంగయ్య ఆవేశం చూసి ఆ విధవ రెండుచేతులు జోడించి 'మంచిది మావయ్యా! మీ రన్నట్లు వారి మరణానికి నేనే కారణం కావచ్చు. ఆయన మరణం మూలంగా నేనూ లోకమంటే ఎరుగని ఈ పసికూనా; ఇద్దరం అనాథుల మయ్యాం. అయన జీవించియున్నప్పుడు ఆయనతోటిదే లోకమనినమ్మాను. ఇప్పుడు నేను మీ ఇంటికి వచ్చింది; ఆయన తుదికోరిక తీర్చడం కోసం. వారు చనిపోతూ నన్ను పిలిచి 'సరోజా! మా ఇంటికి వెళ్ళిపో! నిజంగా నువ్వు నన్ను ప్రేమించిఉంటే, నా తర్వాత నా తలిదండ్రుల్ని సేవించి తరించు. ఈ నిర్బంధం కష్టమైనదైనా సరే, నా కోసం నువ్విలా చెయ్యక తప్పదు. నా తలిదండ్రుల్ని కంటికి రెప్పలా కాపాడి, పోయినవారి పుత్రుణ్ణి నీ నిర్మల హృదయంలో చూపించు. నిన్ను నే నెందుకు భార్యగా స్వీకరించానో వారికి అర్థమయేటట్టు నీలోని మంచితనాన్ని, సహనాన్ని వారికి ఋజువు చెయ్యి అన్నారు, వారికి నే నిచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం నా విధిగా భావించివచ్చాను. మీ దంపతులను పూజించి ప్రేమించవలసిన మీ కుమారుడు మరణించినా, ఆ కర్తవ్యాన్ని నేను నెరవేర్చుకుంటాను. అందువల్ల మీరు నన్ను తిట్టినా కొట్టినా ఏం చేసినాసరే, నేను ఇక్కడే ఉంటాను. మీ కొడుకే బ్రతికిఉంటే, ఆయన మీకు చేసే సేవల్ని నేను చేస్తాను. నేను చిన్నదాన్నే కానీ! రంగయ్య హృదయం ద్రవించి పోయింది. అతని కన్నుల్లో కన్నీళ్లు నిలిచాయి. పైమీద దోవతితో కళ్లుతుడుచు కుంటూ అమ్మా! నీ మాటలు నా హృదయాన్ని ఆవరించుకున్న అజ్ఞానాన్ని తొలగించాయి. ఏ ఉత్తమురాలినైతే, నేను కోడలుగా స్వీకరించడానికి తృణీకరించానో, ఆ పవిత్రమూర్తి నన్ను సేవించడుకోసం నా ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. ఏకోరివినైతే నేను కోడలుగా స్వీకరించానో ఆ మహాతల్లి నన్ను హింసిస్తూ ఇంటినుండి వెళ్ళగొట్టాలని చూస్తూ ఉంది, అమ్మా! చేసిన తప్పుకు చింతిస్తూ ఇప్పుడు నేను ఎంతగానో దుఃఖిస్తున్నాను. భగవంతుడు, మరణించిన నా పుత్రుడు, ముఖ్యంగా నావల్ల ద్రోహంజరిగిన నువ్వు, నన్ను క్షమించు. ప్రపంచంలో ఏ కోడలు కూడా తన భర్త మరణిస్తే, తన అత్త మామల్ని సేవించడానికి అంగీకరించదు. కానీ నువ్వు మా మంచి

చెడ్డల్ని కోరి, మా ఇంటికి వచ్చావ్ నువ్వు నిజంగా దేవతవేనమ్మా! రాజు నిన్నెందుకు అంతగా ప్రేమించి పట్టుబట్టి పెళ్ళి చేసుకున్నాడో, ఇప్పుడు నాకు అర్థమయింది. మంచిదమ్మా! ఈ క్షణంనుండీ నిన్ను నా కన్నకూతురుకంటే మిన్నగా చూసుకుంటాను, అని సీతా, సీతా, ఎక్కడున్నావే? అబ్బా రోజస్తమానం ఆ వంటింట్లో కూర్చొని ఏం చేస్తున్నావే? త్వరగా ఇలారా! మనరాజు భార్య, మన పెద్దకోడలు వచ్చింది, తొందరగారా' అంటూ భార్యను పిలిచాడు.

చేత్తో తడిగుడ్డను పట్టుకొని సీతవచ్చి అబ్బా! ఎందుకండీ అలా పిలుస్తున్నారు? వంటింట్లో బోలెడంత పనిఉంది. ఇడ్లీ చేస్తున్నాను. ఇంటికి వచ్చిన అథితికి ఏదైనా పలహారం పెట్టాలా, లేదా అంది.

'బేష్ బేష్! ఇడ్లీ చేస్తున్నా వన్నమాట ఓ భగవంతుడా, ప్రతిరోజు మా ఇంటికి అథితులువచ్చేటట్టు చూడు తండ్రీ! మేం కమ్మగా ఇడ్లీ ఆరగించవచ్చు అన్నాడు రంగయ్య భార్యవంక చూసి. ఆనాడు ఆ కుటుంబమంతా నవ్వుతూ, కులుకుతూ భోజనాలు ముగించారు. ప్రపంచంలోని మిగతా ఆడవాళ్ళకు ఒక అదర్శంగా నిలబడి, సరోజ తన అత్తమామల్ని కన్నతలిదండ్రుల్లా భావించి సేవిస్తూ ఆ ఇంట్లో నివాసం ఏర్పరచుకుంది.

పద్దెనిమిదేళ్ళ తర్వాత సరోజ కుమార్తెకు వివాహం జరిగింది. వివాహానంతరం, తమ ఇంటికి వచ్చి ఉండిపోమ్మని కోరింది. సరోజను ఆమెకుమార్తె. కాని సరోజ అందుకు అంగీకరించలేదు 'చిట్టితల్లీ! నేనలారాలేను తల్లి నా కర్తవ్యమంతా ముసలివారైన, నీ తాతయ్య, నాన్నమ్మల కోసమే మిగిలి ఉందమ్మా! నేను వారితోనే కలిసి ఉండగలను. భగవంతుణ్ణే నమ్ముకో తల్లి, అతని చల్లని చూపులు మీ నూతన దంపతులను సదా రక్షించాలిగాక! అని సరోజ ఆశీర్వదించింది. కాలవాహినీ ప్రవాహంలో మరికొన్ని

EVEREST
Cotton Banians
TRADE EKC MARK
THE HALL MARK of INDIAN EFFICIENCY
MANUFACTURERS
EVEREST KNITTING COMPANY
UTTUKULI ROAD, TIRUPUR, S.I.

ప్రపంచములో అతి ఎత్తైన శిఖరం, ఎవరెస్ట్ శిఖరం!!
బనియన్లకెల్లా అత్యుత్తమమైనది....
'ఎవరెస్ట్' బనియన్లు.
అందానికీ — మన్నికకూ, పేరొందినది.
ఎవరెస్ట్ నిట్టింగ్ కంపెని.,
తిరుపూరు (S. I.)

## గమనిక.

మా కంపెనీ "గీతా మార్కు" చేనేత వస్త్రములు చాలా నాణ్యమైనవి. పేదలు, మధ్యరకము, ధనికులు మొదలయిన ప్రజలందరికి, అందుబాటులో ఉండు రకములను తయారుచేసి విడుదల చేయుచున్నాము. మీరు బట్టలను ఖరీదు చేయునప్పుడు వాటిమీద "గీతా మార్కు"ను గమనించ ప్రార్థన.

**గీతా అండు కంపెని, జవుళి వ్యాపారం. ఈరోడు.**


ఏళ్లు కొట్టుకుపోయాయి. రంగయ్య బాగా ముసలి వాడయ్యాడు. మృత్యుదేవత ఆహ్వానం అతనికి అతి దగ్గర్లోనే ఉంది. అతను భార్యను కోడల్ని పిలిచి 'అమ్మా! భగవంతుడు మిమ్మల్నిద్దర్నీ సదా ఆశీర్వదించాలి. అమ్మా! నీ జీవిత సౌఖ్యాన్ని మాకోసం త్యాగంచేసి మా ఇంటిని పావనం చేసావు. నాలోని నీ చత్వాన్ని తొలగించావ్ కన్నకొడుకుకూడా చేయలేనంత సేవను, నాకు చేసావ్. నాజీవిత కాలంలో నేనుచేసిన పాపపుణ్యాల లెక్కల్ని అప్పగించడానికి నేను దైవం దగ్గరకు వెళ్ళి పోతున్నాను సీతా! ఒక్కమాట! సరోజ మన ఇంటికివచ్చి, ఇంటిని స్వర్గంగా మార్చింది. సుఖశాంతుల్ని ప్రసాదించింది. ఒకరినొకరు ప్రేమించి జీవించడం నేర్పింది. నేను వెళ్ళి పోతున్నానని దుఃఖించకు సీతా! భగవంతుడు, నా కిచ్చిన ఈ కోడలనే ఆణిముత్యాన్ని నా తర్వాత నీ పరంచేస్తాను. సరోజ మన ఇంటికి వచ్చిన తర్వాతనే, నా హృదయం పవిత్రమయింది, సుఖంగా జీవించగలిగాను. నా తుదిప్రార్థన ఒక్కటే! ఈ లోకమంతా, నా సరోజలాంటి ఉత్తములతో నిండిపోవాలి' అంటూ రెండు చేతులూ జోడించాడు. రంగయ్య కొద్ది రోజుల్లోనే తన భార్యను కోడలును వదలి శాశ్వతంగా ఈ లోకంలోనుండి నిష్క్రమించాడు.

సీతకూడా తన జీవిత శేషాన్ని సరోజ దగ్గరే సుఖంగా వెళ్ళబుచ్చింది. సరోజ సీతల అన్యోన్యానురాగాన్ని చూసినవారు, వాళ్ళిద్దరూ తల్లీ బిడ్డలేమో ననుకొనే వారు గానీ, అత్తాకోడళ్ళని అనుకొనేవారు కారు. ఒక ఉదయాన సీత కూడా నిశ్చింతంగా సరోజ ఒళ్లోనే, తన ప్రాణాన్ని విడిచింది.

ఇప్పుడు సరోజ యవ్వనవతి కాదు. బాగా ముసలిదై పోయింది. కానీ ఆమె హృదయం మాత్రం, అప్పుడే వికసించిన గులాబీలా నిర్మలంగా ఉంది. ఆ ఆదర్శస్త్రీ ముఖంలో ఎప్పుడూ చిరునవ్వు చిందులాడు తుండేది. కానీ, యవ్వనంలోనే భర్తను కోల్పోయి తన వైవాహిక జీవితం మూన్నాళ్ళ ముచ్చ

టగా మారిపోయిందనే విచారరేఖ మాత్రం, అప్పుడప్పుడు సరోజ వదనం మీద తళుక్కు మనేది అంతే! ఒక్కక్షణం తర్వాత తిరిగి మారిపోయి, తన మనుమరాళ్ళతో కలసి పోయి, చంటిబిడ్డలా వాళ్ళతో ఆడుకొనేది. సరోజను చూసిన సహృదయులకు ఒక్కప్రశ్న మిగిలేది. ఇంతటి ఉత్తమురాలు ఏంపాపం చేసిందని, ఆమె భర్తను యవ్వనంలోనే భగవంతుడు దూరంచేసాడు! ఆలోచనా రహితంగా, నువ్వు చచ్చావనుకుంటాను అన్న తండ్రిశాపమే రాజు మరణానికి కారణమయిందో? ఏమో!

సర్వసాధారణంగా ప్రతీ తండ్రీ కూడా, తన బిడ్డల్ని కోపావేశంలో నోటికి వచ్చినట్లల్లా నిందిస్తూ ఉంటాడు. అప్పుడప్పుడు అవే తిట్లు, తథాస్తయితే తాను-తన బిడ్డడూ ఎంతగా దుఃఖపడాలో, అతడు అర్థంచేసుకోడు. మనిషి నెమ్మదిగా మాట్లాడటం నేర్చుకోవాలి. మన బిడ్డలకుగానీ, ఇంకెవరికైనాగాని ఒక చెడ్డమాటతో నిందించే ముందు బాగా శాంతించి, ఓర్మివహించి, ఆ కోపాన్ని ఉపసంహరించుకోవాలి.

ఇహ ఈ పెద్దకథ ముగించేముందు సరోజ కుమార్తె యైన సరళ గురించి రెండు మాటలు చెబుతాను. సరోజ సంరక్షణలో పెరిగి మంచితనాన్ని తనస్వంతం చేసుకున్న సరళ ఇప్పుడు ఎనమండుగురు పిల్లలతల్లి ఆమెకు నలుగురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలు. ఆ సంతానాన్నే ఆమె తన సంపదగా భావిస్తూ మురిసిపోతుంటుంది. ఆమెకు ఫేమిలీప్లేనింగ్, బ్యాంకు బేలన్సులు అంటే అర్థం తెలియవు. తెలిసినా, ఆమె అటువంటి ప్రసంగాలకు తావు ఇవ్వదు. కలసి మెలసి జీవించే పెద్ద ఉమ్మడి కుటుంబంలోని దైవత్వం, మానవుల హృదయాలలో జ్యోతి వెలిగించి, ఇంటిని స్వర్గం చేస్తుందని ఆమె నమ్మకం. ఆ సంపదకు దీటైన సిరిసంపదలుగానీ, సౌఖ్యాలుగానీ, ఈ లోకంలోనె లేవని సరోజ తన సరళకు ఎప్పుడో నేర్పింది. (శ్రీమతి ఇ. ఆల్వారస్ వ్రాసిన ఇంగ్లీషు కథకు ఆధారం)




USE ALWAYS
**ARUNA**
BANIANS

**అరుణ**

బనియన్లనే ఉపయోగించండి.
అవి:-చిరకాల మన్నికకు-రకానికీ అత్యుత్తమమైనది.
అత్యుత్తమమయిన సాదా, వల బనియన్లు, నూలు స్వెటర్లు, ఉత్పత్తిదారులు.

THE ARUNACHALAM KNITTING FACTORY
KARUR
(S.I)

ది అరుణాచలం నిట్టింగ్ ఫాక్టరి,
కరూరు (S.I)